ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

7★

గురువారం 16 అక్టోబరు 2025

18న బంద్‌ను విజయవంతం చేయాలి

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ జేఏసీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు సుల్తానాబాద్‌లో ఈనెల18నాటిబంద్‌ను విజయవంతం చేయాలని సుల్తానాబాద్ మండలబీసీజేఏసీ నాయకులుపిలుపునిచ్చారు. ఈ సందర్భంగావారు బుధవారం మాట్లాడుతూ బంద్ విజయవంతం కోసం, బీసీఐక్యతకోసం అన్నిపార్టీ లకు చెందిన బీసీనాయకులతో గురువారం స్థానిక వైశ్యాభవన్‌లో మధ్యాహ్నం 12గంటలకు సమావేశం ఏర్పాటు చేశామని జేఏసీ నాయకులు కూకట్లనాగరాజు తెలిపారు. మండలంలోని, పట్టణంలోని అన్నిపార్టీ లకుచెందిన బీసీనాయకులు సంఘాలబాధ్యులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుందామన్నారు.

నేరాల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

● సీపీ అంబర్ కిశోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, అక్టో బరు 15 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణలో పోలీసు అధికారులు సమన్వ యంతో ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాలజోన్ పోలీస్‌అధికారులతో నేరసమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్‌స్టేషన్, డివిజన్, జోన్లవారీగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్‌కు సంబంధించి ప్రస్తుతస్థితిగతులపై అడిగితెలుసుకున్నారు. కమిషనరేట్ పరిధిలో నమోదు అయిన కేసుల పరిష్కారం కోసం భవిష్యతులో ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందనే అంశాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ క్వాలిటీఆఫ్ ఇన్వెస్టిగేషన్ కేసుల పరిష్కార శాతం పెంచాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను, యూఐపీడీ కేసులను త్వరగా పరిష్కరించాలని, కేసుల దర్యాప్తులో ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీతో పాటు శాస్త్రీయ పద్ధతిని అనుసరించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం సైబర్‌క్రైమ్ పెద్దసమస్యగా మారిందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతప్రచారం చేయాలన్నారు. గంజా యి, డ్రగ్స్‌నియంత్రణకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసులు విధుల్లో అలసత్వం, ప్రదర్శిస్తే సహించేది లేదని, శాఖపరమైన కఠినచర్యలు తప్పవన్నారు. పోలీస్‌అధికారుల పనితీరుపైనే రామగుండం పోలీస్ కమిషనరేట్ కీర్తి ప్రతిష్ఠలు ఆధారపడి ఉంటాయని అన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా డీసీసీ ఎన్నిక

● తమిళనాడు మాజీ ఎంపీ డాక్టర్ జయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జయకుమార్, విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య బద్ధంగా అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకుడు తమిళనాడు మాజీ ఎంపీ డాక్టర్ జయకుమార్, ఎమ్మెల్యే చింతకుంట రమణారావు పేర్కొన్నారు. స్థానిక ఆర్కే గార్డెన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏఐసీసీనిర్ణయం హర్షించదగ్గదని, రాబోయే కాలంలో సమర్థవంతమైన నాయకుని ఎన్నుకోగలుగుతామన్నారు. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలతో పాటు ధర్మపురి నియోజకవర్గం ధర్మారం గ్రామంలో కూడా అభిప్రాయ సేకరణ చేయనున్నట్లు వివరించారు. డీసీసీ ఎన్నికకు ప్రతికార్యకర్త స్వేచ్ఛగా పోటీ చేయవచ్చని, అయితే అభిప్రాయసేకరణ అనంతరం అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని వివరించారు. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక దరఖాస్తు కోసం ఈనెల 22వరకు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ నేషనల్ కో ఆర్డినేటర్ కేతూరి వెంకటేష్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రాజేష్, టీపీసీసీ ప్రోటోకాల్ సెక్రెటరీ బసిత్, పార్టీ జనరల్ సెక్రెటరీ కాశీపాక రాజేష్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దాన్నాయక దామోదర్‌రావు, ఆరే సంతోష్, మార్కెట్ చైర్మన్లు మినుపాల ప్రకాష్‌రావు, ఈర్ల స్వరూప, గండు సంజీవ్, కాడర్ల శ్రీనివాస్, చిలుక సతీష్, మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, సదయ్య, పట్టణ అధ్యక్షుడు భూషణవేణి సురేష్‌గౌడ్, వేగోలపు అబ్బయ్యగౌడ్, ముత్యాల నరేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో సమానంగా అంగన్‌వాడీ టీచర్లు అంకితభావంతో పని చేస్తూ పారదర్శకంగా పని చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం మండలంలోని శివపల్లి గ్రామంలోని ఆయన స్వగృహంలో ఏడు మండలాలకు చెందిన 305మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నూతన డ్రెస్‌కోడ్ వస్త్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సంపద కుమారి, పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, ఆయా మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుకు రైతులు ముందుకు రావాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే రైతులు పామాయిల్ సాగు చేసేందుకు ముందుకు రావాలని ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి బోడకల రాము అన్నారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని కాసులపల్లి, పాలితం గ్రామాల్లో దాసరి వెంకట రమణారెడ్డి, దాసరి విష్ణు ప్రీతం రెడ్డి సాగుచేస్తున్న పామాయిల్, కొమ్మ గంగాధర్ సాగు చేస్తున్న నిమ్మతోటలను పరిశీలించారు. పామాయిల్ సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పామాయిల్ సాగుకు ఆసక్తి గల రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్, ఒక ఫొటోతో మండల వ్యవసాయ కార్యాలయంలో లేదా, అందుబాటులో ఉన్నా రైతువేదికకు వెళ్లి ఏఈవోకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● భార్యాభర్తలిద్దరూ మహారాష్ట్ర సీఎం వద్దే లొంగుబాటు

● వేణు వస్తాడని 9నెలల క్రితమే సీఎం జోస్యం

● తొమ్మిదిన్నర నెలల్లో ఒకరి తర్వాత మరొకరు

● మహారాష్ట్ర సీఎం ఎదుట మల్లోజుల సహా 61మంది లొంగుబాటు



లొంగుబాటు.. 'తారక' మంత్రమేనా?

మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయిన మల్లోజుల వేణుగోపాలరావు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పొలిట్ బ్యూరో మెంబర్, పార్టీ సిద్ధాంతకర్త అయిన మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్, సోనూదాదా, భూపతి లొంగిపోవడం వెనుక " తారక " మంత్రం ఫలించి ఉంటుందా.. అనే చర్చ జరుగుతున్నది. ఆయన సహచరి అయిన కేంద్ర కమిటీ సభ్యురాలు సిదాం విమలచంద్ర అలియాస్ తారక్క, వత్సల ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. వేణుగోపాల్‌రావు కూడా బుధవారం 61మంది మావోయిస్టులతో కలిసి ఆయుధాలతో లొంగిపోయారు. వారంరోజుల క్రితమే ఆయన హైదరాబాదులో డీజీపీ ఎదుట లొంగిపోనున్నారని వార్తలు వచ్చాయి. కానీ మహారాష్ట్ర సీఎం ఎదుట లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా తారక్క లొంగిపోయినప్పుడు సీఎం ఫడ్నవిస్ "వేణు కూడా ఆరు మాసాల్లో వస్తాడని మాకు సమాచారం ఉంది " అని అలవోకగా మాట్లాడిన మాటలను ఇప్పుడు అందరూ గుర్తు చేసుకుంటున్నారు. అలాగే మల్లోజుల కోటేశ్వర రావు సహచరి అయిన కేంద్రకమిటీ సభ్యురాలు పోతుల సుజాత అలియాస్ మైనక్క కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 13వ తేదీన రాష్ట్ర డీజీపీ ఎదుట లొంగిపోయారు. తారక్క, సుజాత అనారోగ్య కారణాల వల్ల లొంగిపోయినప్పటికీ, వేణు గోపాల్ మాత్రం సాయుధపోరాటం వీడాలనే దృక్పథంతోనే అజ్ఞాతం వీడినట్టు అర్థం అవుతున్నది. వీరు ముగ్గురు ఒకరి తర్వాత ఒకరు తొమ్మిదిన్నర నెలల కాలంలో లొంగిపోయారు. ఇదంతా వ్యూహాత్మకంగానే జరిగి ఉంటుందా, మల్లోజుల లొంగుబాటు వెనుక తారక మంత్రం ఏమైనా ఉంటుందా? అనే చర్చ జరుగుతున్నది.

● **విప్లవోద్యమ చరిత్రలో సంచలనం..**

సీపీఐ(ఎంఎల్) పీపుల్స్ వార్ గ్రూపు, తదితర నక్సల్స్ గ్రూపులన్నీ 2004లో ఏకమైన తర్వాత సీపీఐ మావోయిస్టు పార్టీగా అవతరించిన నాటినుంచి పెద ఎత్తున ఆయుధాలతో మల్లోజు వేణుగోపాల్‌రావు లొంగిపోవడం భారత విప్లవోద్యమ చరిత్రలోనే సంచలనంగా నిలుస్తున్నది. వివిధ కారణాలవల్ల అనేకమంది నక్సలైట్లు లొంగిపోయినప్పటికీ, ఇంత పెద్ద మొత్తంలో లొంగిపోయిన ఉదంతం ఇదే కావడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి దేశంలో మావోయిస్టు పార్టీని లేకుండా చేయా లని కంకణం కట్టుకున్న కేంద్ర ప్రభుత్వం గత ఏడాదిన్నర క్రితం ఆపరేషన్ కగార్ చేపట్టి దండకారణ్యాన్ని, కర్రెగుట్టలను, అబూజ్‌మడ్‌ను గుర్తించిన భద్రతా బలగాలు కూంబింగులు చేస్తూ మావోయిస్టులను మట్టు పెడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈ ఏడాది మే నెలలో జరిగిన ఎన్‌కౌంటర్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సహా 27మంది నక్సలైట్లు ప్రాణాలు కోల్పోవడం సంచలనం రేపింది. ఆ తర్వాత మరో ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులు కూడా ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. కగార్‌ను నిలిపివేయాలని, శాంతిచర్చలు జరపాలని ప్రజా సంఘాలు, మావోయిస్టులు కోరుతున్నప్పటికీ, తగ్గేదిలేదంటూ కేంద్ర ప్రభుత్వం అందుకు ససేమిరా అంది. ఇదే క్రమంలో నెలరోజుల

(మిగతా 10వ పేజీలో)

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): రికార్డు స్థాయిలో వానాకాలం పంట కొనుగోలుకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ నుంచి వానాకాలం ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ కే రామకృష్ణారావు, ఇతర రాష్ట్రఉన్న తాధికారులతోకలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వానాకాలం పంట కొనుగోలుకి అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధతో చేపట్టాలని అన్నారు. గతంలో ఉన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ప్రతికొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్పాలిన్‌కవర్లు, గోనెసంచులు,వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర సామాగ్రి సిద్ధం చేసుకోవాలని, కొనుగోలు సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదురు చూసే పరిస్థితి రాకుండా చూడాలని అన్నారు. గతంలో దురదృష్టవశాత్తు కొనుగోలు కేంద్రం వద్ద ఒక రైతు మరణించారని అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. కొనుగోలు వేగవంతం చేసేందుకు జిల్లా స్థాయిలో అవసరమైతే మిల్లర్లకు కొంత మినహాయింపు ఇవ్వాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీ జరిగేలా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. 2025వానా కాలం సీజన్ నందు ధాన్యం డబ్బులు, బోనస్ 48నుంచి 72గంటల లోగా రైతులకు ఖాతాలలో జమ చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు బాగా జరుగుతుందని ప్రభుత్వానికి మంచిపేరు ఉందని, మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు చేసేందుకు కలెక్టర్లు ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం జిల్లాకలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ కాళిందిని, డీఏవో శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రామగుండం నగరాభివృద్ధి పనులు

యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

● పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కా న్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధికారులకు సూచించారు. బుధవారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రదేశంలో అభివృద్ధి పనులు, గోదావరివద్ద శ్మశానవాటిక నిర్మాణపనులు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణపనులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.3కోట్లతో నూతనంగా నిర్మించనున్న కళాశాల, డిగ్రీకళాశాల వద్ద ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదలను, మున్సిపల్‌జంక్షన్ వద్దఉన్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షసమావేశాన్ని నిర్వహించి అధికారులకు పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.28.08కోట్ల డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా నగరంలో 181 అభివృద్ధి పనులు మంజూరు చేయడం జరిగిందని, వీటికి సంబంధించిన టెండర్లప్రక్రియ త్వరగా చేపట్టి పనులను మొదలయ్యే విధంగా చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు. రామగుండం నియోజకవర్గంలో ఎన్‌టీపీసీ సీఎస్‌ఆర్ నిధుల ద్వారా రూ.8.55కోట్లతో 31అభివృద్ధి పనులను మంజూరు చేస్తామని, వీటిలో చాలావరకు నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయన్నారు. అభివృద్ధి పనులకు నిధుల ఆటంకం లేనందున పనులు ఎక్కడఆలస్యం కాకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్‌వెంట ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, నగరపాలకసంస్థ కమిషనర్ అరుశ్రీ, ఈఈ రామన్, నాయకులు మహంకాళి స్వామి, దీటి బాలరాజు, యుగంధర్, పెండ్యాల మహేష్‌దాసరి విజయ్, ముస్తాఫా ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

● రామగిరి ఖిల్లా కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్

రామగిరి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీని ఉపయోగించి మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రామగిరి ఖిల్లా శాస్త్రవేత్త ఏ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని లొంక కేసారం గ్రామంలో అంతర్జాతీయ మహిళారైతు దినోత్సవం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళల అభివృద్ధికి గ్రామాల్లో కేవీకే చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. మహిళలు స్వయం ఉపాధి పొందడానికి వివిధ శిక్షణకార్యక్రమాలు చేపడుతున్నామని, మాంసం ఆధారిత ఉత్పత్తుల తయారీపై హైదరాబాద్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల మహిళా రైతులునమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మ, శాస్త్రవేత్తలు నవ్య, వినోద్ కుమార్, సీసీ శ్రీధర్, సీఏ సునీత,మహిళలు పాల్గొన్నారు.

దేవునిపల్లి జాతరకు వేలం పూర్తి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కార్తీకమాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఆలయంలో లడ్డూ,పులిహోర, ప్రసాదం, కొబ్బరికాయలు విక్రయించేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో లడ్డూ, పులిహోర ప్రసాదం అమ్మకం రూ.4,25,400, కొబ్బరికాయల అమ్మకానికి రూ. 1,75,600లకు వేలం ద్వారా విక్రయదారులు దక్కించుకున్నారు. రెండు విక్రయాలను ఒకేవ్యక్తి పొందినట్లు ఆలయ ఈవో శంకర్ తెలిపారు. వేలం కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, బొక్కల సంతోష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ పద్ధతుల్లో పత్తి కొనుగోళ్లు 10లో

● వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వైనాల రాజు

మాదక ద్రవ్యాల నియంత్రణకు

కట్టుదిట్టమైన చర్యలు

● అదనపు కలెక్టర్ డి వేణు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైనచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి వేణు అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బనావత్ వనజతో కలిసి అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదకద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అదనపుకలెక్టర్ మాట్లాడుతూ, భావితరాలు మాదకద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, మోడల్‌పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్ మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్యఅధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సింగరేణికి వందేళ్ల భవిష్యత్ 10లో

రోడ్డు విస్తరణకు తొలగిన అడ్డంకులు

● నిర్మాణం పూర్తైన ఐబీ కాంప్లెక్స్ గదులు ● తొలిగిన అడ్డంకులు.. ● రోడ్డువిస్తరణ పనులకు త్వరలో శ్రీకారం



విస్తరించనున్న ఐబీ చౌరస్తా రోడ్డు

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనేక అవాంతరాల మధ్య ఐబీ చౌరస్తా నుంచి గట్టెపల్లి వరకు ఉన్న రోడ్డు విస్తరణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఐబీ చౌరస్తా నుంచి గట్టెపల్లి రోడ్డు వరకు ప్రస్తుతమున్న రోడ్డు చాలా ఇరుకుగా ఉండటంతోపాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఉంటున్నది. అలాగే ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే విజయ రమణారావు పట్టణాన్ని సుందరీక రించాలనే ఆలోచనలో భాగంగా ఈ రోడ్డు విస్తరణ పనులకు ఉపక్రమించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేయగా, ఎమ్మెల్యే విజయరమణరావు చేతుల మీదుగా పనుల ప్రారంభానికి శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రస్తుతం రోడ్డును ఆనుకొని ఉన్న ఆర్‌అండ్‌బీ వారి వ్యాపార వాణిజ్య సముదాయ గదులు అడ్డంకిగా మారాయి. రోడ్డును విస్తరించాలంటే ఈ గదులను కూల్చివేసి మరింత లోపలకు నిర్మించాలని అధికారులతో ఎమ్మెల్యే చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న గదుల వెనకాల కొత్తగా 18గదులను నిర్మించారు. ఈ పనులు పూర్తి కావడంతో రోడ్డువిస్తరణ పనులకు ఉన్న అడ్డంకులు తొలగిపోయినట్లయ్యింది. త్వరలోనే పాతగదులను కూల్చివేసి రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అత్యంత ప్రధానమైన ఈ రోడ్డులో ప్రభుత్వహాస్టల్స్‌ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలలు, కోర్టులు, తహసీల్దార్, మండల పరిషత్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. దీంతో ఈ రోడ్డు ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని విస్తరణ పనులు చేపడుతామని తెలిపారు.

● **ఐబీ చౌరస్తా విస్తరణతో ప్రజలకు ఎంతో మేలు**

- పన్నాల రాములు, మాజీ ఎంపీటీసీ



నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో ఎంతో రద్దీగా ఉండే ఐబీ చౌరస్తా నుంచి గట్టెపల్లి రోడ్డు విస్తరణ ప్రజలకు, వివిధ గ్రామాల నుంచి వచ్చే వారికి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ఇరుకు రోడ్డు మూలంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

● గర్షకుర్తి విష ప్రయోగం ఘటనలో ఇప్పటికే భర్త మృతి



లక్ష్మి (ఫైల్)

గంగాధర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలో వృద్ధ దంపతులపై విష ప్రయోగంలో ఇప్పటికే భర్త మృతి చెంద గా భార్య తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. గర్షకుర్తిలో ఈ నెల 7న గజ్జల శంకరయ్య అతని భార్య లక్ష్మీలకు అదే గ్రామానికి చెందిన కత్తి శివ మత్తు గుళికలు ఇవ్వ డంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుం డగా శంకరయ్యకు పరిస్థితి విషమించి ఈనెల 8న మృతిచెందాడు. అప్పటి నుం చి కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీ బుధవారం తుది శ్వాస విడిచింది. వృద్ధ దంపతులపై విషప్రయోగం జిల్లా లో కలకలం రేపింది. గంగాధర ఎస్సై కేసును పలు కోణాల్లో దర్యాప్తు చేసి నిందితుడు కత్తి శివను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి నగదు, బంగారం స్వా ధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం పెద్దపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే పట్టణానికి చెందిన వెలిచాల రమేష్(55) కూనారం రోడ్డులో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న నిచ్చెనను రెండో అంతస్తుకకు తీసుకెళ్తుండగా నిచ్చెన 11కేవీ వైర్లకు తాకి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రమేష్ భార్య సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గోదావరిలో కొట్టుకొచ్చిన ఆర్మూర్ వాసి మృతదేహం

మల్లాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన జోరిగే గంగాధర్(35) అనే వ్యక్తి మృతదేహం బుధవారం మల్లాపూర్ మండలంలోని కొత్తధాంరాజుపల్లి శివారులోని గోదావరి నదిలో గుర్తించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జోరిగే గంగాధర్ నిర్మల్ జిల్లా కేంద్రంలో ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థికంగా నష్టపోయిన గంగాధర్ అప్పు ఎక్కువడంతో ఈ నెల 8న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 10న సొన్ బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం కొత్తధాంరాజుపల్లి శివారులోని గోదావరి నదిలో విగతజీవిగా కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా భార్య మౌనిక మృతదేహం పరిశీలించి భర్త జోరిగే గంగాధర్‌దేనని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయిలో యువకుడి అనుమానాస్పద మృతి

- స్వగ్రామానికి చేరిన మృతదేహం



తేజ (ఫైల్)

గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన పిట్ల తేజ(24) అనే యువకుడు ఇటీవల గల్ఫ్‌లో అనుమానాస్పదంగా మృతిచెందగా, బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉపాధి నిమిత్తం 8 నెలల క్రితం తేజ రూ.లక్షకు పైగా అప్పు చేసి దుబాయికి వెళ్లాడు. అక్కడ పనిసరిగా లేక ఇబ్బందులు పడ్డ తేజ ఆగస్టు 29న ఇండియాకు వస్తున్నట్టు కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. ఇండియాకు వచ్చే క్రమంలో అనూహ్యంగా దుబాయిలో తప్పిపోయి, మరుసటి రోజు రూంకు వచ్చాడు. తేజ ఒంటిపై గాయాలు ఉండటంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి తిరిగి సెప్టెంబరు 3న తన రూం వచ్చాడు. తెల్లారేసరికి తేజ మళ్లీ రూంలో కన్పించకపోవడం, సెప్టెంబరు 19న పోలీస్‌లకు శవమై కన్పించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తేజ మరణవార్త సెపెంబరు 23న వారి బంధువులకు తెలిసింది. 27 రోజులకు తేజ మృతదేహం స్వగ్రామమైన నాగంపేటకు వచ్చింది. మృతుడికి తల్లిదండ్రులు లత, రాజేష్, తమ్ముడు గౌతమ్ ఉన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య



శంకరయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు భరించలేక మనస్థాపం చెందిన వ్యవసాయ కూలీ చాట్ల శంకరయ్య(55) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని శంకరయ్య వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స అందించినా ఆరోగ్యం కుదుట పడలేదు. మనస్థాపం చెందిన శంకరయ్య ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు నర్సింలు, సురేందర్, కూతురు శిరీష, తల్లి లక్ష్మి ఉన్నారు.

జాడ లేని చేప పిల్లలు



● సమయం మించిపోతున్నా పట్టించుకోని పాలకులు.. అధికారులు

● ఆలస్యమైతే ఎదగడం కష్టం...

ఇల్లందకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటును ఇచ్చేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే చేప పిల్లల కోసం టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అలా చెస్తేనే చెరువులు నిండే వరకు చేపపిల్లల పంపిణీ సాధ్యమవుతుంది. ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడంతో మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

ఊసేలేని టెండర్లు...

గతంలో చేప పిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మే నెలలోనే జరిగేది. కాంట్రాక్టర్లు సీజన్ మొదలయ్యే లోపే చేప పిల్లలను మండలాలకు చేప పిల్లలు చేర్చి చెరువుల్లో వదిలేవారు. దీంతో చేప పిల్లల ఎదుగుదల బాగుండేది.

అదను దాటితే అంతే సంగతులు...

అదను దాటిన తర్వాత చేప పిల్లలను చెరువులో వదిలితే వాటి ఎదుగుదల సరిగా ఉండదు. ఆగస్టు, సెప్టెంబరు నెల చివరి లోపే చేప పిల్లల పెంపకాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది. అప్పుడే చేప పిల్లల ఉత్పత్తి బాగుంటుంది. లేదంటే ఏ రకమైన చేప అయినా సరే బరువు అంతంతగా పెరుగుతుంది. ప్రభుత్వం చేప పిల్లలకు సంబంధించిన టెండర్లు నిర్వహించాలని మత్స్యకార సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఆలస్యమైతే ఎదగడం కష్టం..



యామ శ్రీనివాస్, మత్స్యకారుడు, టేకుర్తి

చేప పిల్లలను ప్రభుత్వం ఆలస్యంగా పంపిణీ చేస్తే వాటి ఎదుగుదల కష్టంగా ఉంటుంది. ప్రతి ఏటా చేపలను పట్టుకొని అమ్మడం వల్ల కొంత ఉపాధి దొరికేది. రెండేళ్లుగా చేప పిల్లల పంపిణీ లేక ఉపాధి కోల్పోతున్నాం. ఇప్పటికే సమయం దాటి పోయింది. ఈ నెలాఖరు వరకైనా పంపిణీ చేయాలి.

ప్రభుత్వం స్పందించాలి



పుట్ట రాజు, మత్స్యకారుడు, వాగొడ్డురామన్నపల్లి

గ్రామాల్లోని చెరువుల్లోకి చేపల పిల్లల పంపిణీ రెండేళ్లుగా నిలిచిపోయింది. ప్రభుత్వం స్పందించి చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలి. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి చెరువుల్లో చేపలను పంపిణీ చేయాలి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కథలాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండ్రియాల, తక్కళ్లపల్లి, బొమ్మెన పెద్దవాగులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను బుధవారం రెవెన్యూ అధికా రులు పట్టుకున్నారు. ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతిలో' ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువు.. అనుమతులకు అధికారుల నిరా కరణ అనే శీర్షికన ప్రచురితమైన కథనా నికి అధికారులు స్పందించారు. ఏకకా లంలో మూడు బృందాలు దాడులు చేసి అక్రమంగా వాగు నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కరీంనగర్ రూరల్‌లో..

కరీంనగర్ క్రైం : కరీంనగర్ రూరల్ మండ లం వల్లంపహాడ్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని శ్రవణ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కోరుట్ల రూరల్, 15 (ఆంధ్రజ్యోతి) పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే ..కోరుట్ల రూరల్ మండంలోని మాదాపూర్ శివారు, రామారావుపల్లె శివారులో వేర్వేరుగా రెండు గ్రూపులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు జిల్లా సీసీఎస్, కోరుట్ల పోలీసులు దాడులు చేసి వారిని పట్టుకున్నట్లు కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. మాదాపూర్ శివారులోని గ్రూపులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ,12150లు, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీన పరుచుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు. రామారావు పల్లె శివారులో పేకాట ఆడుతున్న మరో గ్రూపు నుంచి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీకుకోగా వారి వద్ద నుంచి రూ, 5100లు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

25 నుంచి యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రథమ మహాసభలను ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్నట్లు సంఘం నగర కార్యదర్శి అల్లపు అభిలాష్ తెలిపారు. బుధవారం ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై చర్చించ నున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో విద్యారంగ సమస్యలపై చేపట్టనున్న కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మణి తేజ, అభిలాష్, ఉమామహేశ్వర్, రాకేష్, సాయి కుమార్ పాల్గొన్నారు.

కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించవద్దు

జమ్మికుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించవద్దని అఖిలపక్ష విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాల మైదానం విస్తీర్ణం 20ఎకరాలు ఉండేదని, ప్రస్తుతం 8 ఎకరాలకు వచ్చిందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. అథ్లెటిక్స్ స్టేడియం వస్తే వాకింగ్ చేసేవారికి, ఆడుకునే పిల్లలకు భంగం కలిగే అవకాశాలు ఉంటాయన్నారు. కబ్జాకు గురైన ఇండ్లను కూల్చేసి స్టేడియం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సాయిరాం, వెంకటేష్, సజ్జద్, రత్నాకర్, సుధీర్, రాజేష్, విష్ణు, నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు చెల్లించడం లేదని ఇంటికి తాళం

- గర్జనపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన బాకీ డబ్బులు చెల్లించకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న పాపానికి ఇంటిలో నుంచి కుటుంబ సభ్యులను బలవంతంగా బయటకు గెంటేసి తాళం వేసిన సంఘటన వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. అప్పు ఇచ్చిన వ్యక్తి తమను మానసికంగా వేధించడంతో పాటు ఇంటికి తాళం వేశారని పేర్కొంటూ బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని అబ్రహం అదే గ్రామానికి చెందిన నరేశ్ వద్ద రూ2.50 లక్షల అప్పు తీసుకున్నాడు. అందుకు అతని సోదరుడు బాబు మధ్యవర్తిగా వ్యవహరించాడు. ప్రతినెలా వడ్డీ కింద అబ్రహం రూ.25 వేలు చెల్లించేవాడు. మూడు నెలల నుంచి డబ్బులు చెల్లించకపోవడంతో అబ్రహంను బాకీ ఇచ్చిన వ్యక్తి నరేశ్ అడిగాడు. పరిస్థితి బాగులేదని విన్నవించుకున్న ఆయన పట్టించుకోలేదు. మధ్యవర్తిగా ఉన్న బాబు ఇంటికి వెళ్లి తన డబ్బులు చెల్లించాలని లేనిపక్షంలో ఇంటికి తాళం వేస్తానని తేల్చిచెప్పాడు. కొంత గడువు ఇస్తే బాకీ డబ్బులు ఇప్పించేలా చూస్తానని ప్రాధేయపడినా వినిపించుకోకుండా బాబు ఇంటికి నరేశ్ తాళంవేశాడు. దాంతో బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన రేణికుంట బాబు(34) అనే యువకుడు మోటారు సైకిల్‌పై మానకొండూర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. గంగిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మోటారు సైకిల్‌పై కరీంనగర్ వెళ్తుండగా లలితాపూర్ బస్టాండ్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో బాబుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

దాడి కేసులో ఒకరికి మూడు సంవత్సరాల జైలు

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామంలో తల్లి, తమ్ముళ్లపై దాడి చేసిన కేసులో ఎర్ర అక్షయ్‌కుమార్ (21)కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ధర్మపురి కోర్టు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ యేగి జానకి తీర్పు వెలువరించారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల దొంతాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర కళావతి భర్త మృతి చెందిన తరువాత తన పెద్ద కొడుకు అక్షయ్‌కుమార్ డబ్బులు అడుగుతూ తరచుగా గొడవలు పెట్టాడు. తల్లి, తమ్ముళ్లపై దాడికి పాల్పడడంతో అతడి బాధలు భరించలేక కళావతి తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. 2020 అక్టోబరు 4న రాత్రి అక్షయ్‌కుమార్ తన స్నేహితులను తీసుకువచ్చి తల్లిని, తమ్ముళ్ల సంజయ్‌కుమార్, ఉదయ్ కుమార్‌లపై దాడి చేశాడు. కళావతి అన్న దాసరి కిషన్ అడ్డుగా వెళ్లగా అతడిపై కూడా దాడి చేశాడు. కొడుకు అక్షయ్‌కుమార్ వల్ల తనకు ప్రాణ భయం ఉందని బాధితురాలు కళావతి ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడు ఎర్ర అక్షయ్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ యేగి జానకి తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడికి జైలు శిక్ష పడటంలో కృషి చేసిన అడిషనల్ పీపీ రాజేష్, ఇన్వెస్టిగేషన్ ఎస్ఐలు శ్రీకాంత్, కిరణ్‌కుమార్, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు పీసీ మహేష్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

అయినవారు దూరమై అనాథగా బాలుడు

● మూడు రోజుల క్రితం తండ్రి, గతంలో తల్లి మృతి



స్వాద్విన్ కుమార్

చొప్పదండి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన దీకొండ స్వాద్విన్‌కుమార్ తల్లిదండ్రులు కోల్పోవడంతో అనాథగా మారాడు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న స్వాద్విన్ కుమార్ తండ్రి దీకొండ అశోక్ గత ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. మూడు సంవత్సరాల క్రితం తల్లి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో మరణించింది. తల్లి మరణించిన తరువాత అన్ని తానై పెంచిన తండ్రి కూడా మరణించ డంతో స్వాద్విన్ కుమార్ ఒంటరిగా మిగిలాడు. తాత,నానమ్మలు కూడా గతంలో మరణించగా బాలుడి పరిస్థితి దిక్కులేని వాడు అయ్యాడని గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కన్నీటి పర్యంతం అవుతున్నాడు.

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై దెబ్బతిన్న బారికేడ్లు



వై జంక్షన్ సమీపంలో పక్కన పడి ఉన్న బారికేడ్



దిగువ కొండగట్టు ఘాట్‌రోడ్డు ప్రారంభంలో దెబ్బతిన్న బారికేడ్

మల్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన బారికేడ్లపై నిర్లక్ష్యం అలుముకుంది. ఏడేళ్ల క్రితం ఘాట్‌రోడ్డుపై జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో సుమారు 67మంది మృతి చెందడంతో ప్రభుత్వం ఈ ఘాట్‌రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేసింది. తరువాత కొన్నాళ్లకు షరతులతో వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వగా భారీ వాహనాలను పూర్తిగా నిషేధించింది. ఇందులో భాగంగా దిగువ కొండగట్టు వద్ద ఘాట్‌రోడ్డు ప్రారంభంలో, ఘాట్ రోడ్డు చివరలో కొండపై వైజంక్షన్ వద్ద రెండు భారీ వాహనాల రాకపోకలు ఉండకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొండపై వైజంక్షన్ వద్ద గల బారికేడు పూర్తిగా కూలిపోవడంతో పక్కన పడేశారు. కొండ కింది బారికేడు వాహనాలు ఢీకొని దెబ్బతిన్నది. భారీ వాహనాలు బారికేడు కింద నుంచి వెళ్లాలనే ప్రయత్నంలో బారికేడ్లు దెబ్బతిని ధ్వంసం అవుతుండగా పట్టించుకునే వారే లేకపోవడంతో భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ప్రమాదానికి ముందు ఏర్పాటు చేసినవి ఇలాగే పడిపోవడం, మళ్లీ ఏర్పాటు చేయకపోవడంతో బస్సు ప్రమాదంతో పాటు అనేక ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో భక్తులు మృత్యువాత పడ్డ సంఘటనలను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు కూడా బారికేడు కూలిపోవడంతో అడ్డు కనిపించక బారీ వాహనాలు ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

బీసీ సంఘాల బంద్‌ను విజయవంతం చేయాలి



బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ఈ నెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయలని ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ సంఘాల, కుల సంఘాల నాయకులతో బుధవారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, ఆది మల్లేశం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు, నారోజు రాకేష్ చారి, కోడూరి పర్శరామ్ గౌడ్, నర్సింగోజు శ్రీనివాస్, రంగు సంపత్ గౌడ్, మాచర్ల అంజయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్ జయప్రదం చేయాలి

భగత్‌నగర్ : బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో బీసీ హక్కుల సాధన కోసం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టాన్ని ఆమోదించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పిన ప్రమాదంలో వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి సుల్తానాబాద్ వైపు వస్తున్న పట్టణంలోని మార్కండేయకాలనీకి చెందిన దేవోజు లక్ష్మినరసింహచారి(52) మండలంలోని కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108ద్వారా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

కల్వచర్లలో చోరీ.. పోలీసుల తనిఖీలు



కల్వచర్లలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

రామగిరి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామంలోని సౌమిత్రి లావణ్య పాతగృహంలో చోరీ జరిగింది. శివాలయం వెనకల గల పాత ఇంటిలో స్టోర్ చేసిన ఇత్తడి, రాగి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఉదయం పాత ఇంటిలోకి వెళ్లి చూడగా చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితురాలు పోలీస్‌లకు సమాచారం ఇవ్వగా ఎస్ఐలు శ్రీనివాస్, దివ్య ఆధ్వర్యంలో పోలీస్‌లు ఘటనస్థలాన్ని పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని అంచనా వేశారు.

● **మార్కెట్‌లో జేబుదొంగతనం**

మండలంలోని సెంటినరీకాలనీలోని సంతలో బుధవారం జేబుదొంగతనం చేస్తూ పట్టిబడిన ఇద్దరిని వ్యాపారస్తులు పట్టుకున్నారు. అనంతరం ఇద్దరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

అగ్నిప్రమాదం

వేములవాడ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్(ఇన్‌కేబుల్) నెట్‌వర్క్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మెయిన్ బోర్డులో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. షార్ట్‌సర్క్యూట్ ప్రభావంతో కార్యాలయంలోని దాదాపు రూ.2లక్షల విలువైన కంప్యూటర్లు, ఇతర కీలకమైన ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అయినప్పటికీ కేబుల్ నెట్‌వర్క్ సేవలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా వెంటనే యజమాని కొలిపాక నర్సయ్య ప్రత్యామాయ ఏర్పాటు చేశారు. అనంతరం అగ్నిమాపక అధికారులు నష్టం అంచనా వేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్ గ్రామానికి చెందిన రాజేష్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా గుర్తించిన పోలీసులు బుధవారం అతడికి అప్పగించారు. 2023 నవంబరు 22న బొమ్మకల్‌లో సెల్‌ఫోన్ పోగొటుకున్న రాజేష్ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ కర్నూల్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాజేష్‌కు సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అందజేశారు. ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

జమ్మికుంట రూరల్ : జమ్మికుంటకు చెందిన లకిడి వీణరాణి ఇటీవల తన వివో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుంది. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీస్‌లు వెంటనే ఐఎంఈఐ నెంబర్ ద్వారా మొబైల్‌ను పట్టుకున్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ నాగరాజు మహిళకు ఫోన్ అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు ఒప్పందం



ఒప్పంద పత్రాలను తీసుకుంటున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన పూర్వక ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నట్లు శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ తెలిపారు. బుధవారం నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన పూర్వక ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి కంపెనీలలో ఉద్యోగాలు రావడానికి అవకాశాలు కల్పిస్తారని, మూడు సంవత్సరాలు ఈ ఒప్పందం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలే అవగాహన ఒప్పందం లక్ష్యమన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, డాక్టర్ హరికాంత్ పాల్గొన్నారు.

'రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దు'..



శంకరపట్నం మండలంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

శంకరపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రహదారులపై రైతులు వరి ధాన్యం ఆరబోయడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని రైతులు దారుల వెంట వరిధాన్యం ఆరబెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కొన్ని గ్రామాల్లో రైతులు తమ వరి పంటను రహదారులపై ఆరబెట్టడం గమనించినట్లు తెలిపారు. వాహనదారులు జారిపడడం, ప్రమాదాలు జరగడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రహదారులు ప్రజా వినియోగానికి చెందినవని, వాటిపై వస్తువులు, పంట ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగితే శిక్షార్హులు అవుతారన్నారు. రైతు సోదరులు తమ పంటలను రహదారులపై కాకుండా గ్రామాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

కూరగాయాల సాగు..

● అనుకూలించని పరిస్థితులు.. ఆందోళనలో కూరగాయల రైతులు ● పెరిగిన పెట్టుబడులతో నష్టాలు.. ● రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనుకూలించని వాతావరణ పరిస్థితులతో కూరగాయల రైతులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల సాగు ఒడిదొడుకులతో కూడుకున్నప్పటికీ ప్రతి సంవత్సరం మండలంలో సాగువిస్తీర్ణం పెరుగుతోంది. చిన్న కమతాలు, నీటి సౌలభ్యం బాగాలేని రైతులు కూరగాయల సాగుకు ఎక్కువగా మొగ్గుచూపుతుంటారు. పెట్టుబడులు పెట్టి ఆదాయం కోసం ఎక్కువ కాలం వేచి ఉండని రైతులు సైతం కూరగాయ పంటలను సాగుచేస్తుంటారు. మండలంలోని రహీంఖాన్‌పేట, రామోజిపేట, తిప్పాపూర్, పొత్తూరు, దాచారం, వల్లంపట్ల తదితర గ్రామాలలోని రైతులు ఎక్కువగా కూరగాయల పంటలను సాగుచేస్తుంటారు. మండలంలో గత వానాకాలంలో 75ఎకరాల విస్తీర్ణంలో కూరగాయ పంటలను సాగుచేయగా ఈసారి అధికారుల లెక్కల ప్రకారం 90ఎకరాలు సాగుచేస్తున్నారు. దీనికి తోడు మరికొన్ని గ్రామాల్లోను కూరగాయలను సాగుచేస్తున్నారు. ఎక్కువగా టమాట, మిరప, కాకర, బీరకాయ, పచ్చిమిర్చి, కీరదోస



రహీంఖాన్‌పేట గ్రామంలో సాగవుతున్న టమాట



బీరతోటను పరిశీలిస్తున్న డివిజన్ హార్టికల్చర్ అధికారి

పంటలను సాగుచేయడానికి రైతులు మొగ్గు చూపుతుంటారు. వరుసగా కురిసిన వర్షాలతో పంటలను తీవ్ర నష్టం జరిగింది. దీనికి తోడు సరైన ధరలు లేకలేకపోవడంతో పెట్టుబడులు వచ్చేలా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25కిలోల టమాట బాక్స్ ధర ప్రస్తుతం రూ 400 వరకు రైతులు అమ్ముతున్నారు. టమాటాలను తెంపడానికే ఒక కూలీకి రోజుకు రూ 350 చెల్లిస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. గతంలో కంటే చేలకు తెగుళ్ళు ఎక్కువగా వస్తున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం కూరగాయల రైతులకు అండగా నిలబడాలని రైతులు కోరుతున్నారు.

మార్కెటింగ్ సదుపాయం లేక..

కూరగాయలను పండించిన రైతులకు సరైన మార్కెటింగ్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలను తెంపిన అనంతరం ఆటలో సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్‌కు తరలించడానికి ఆటో కిరాయి తీసుకొని పోతుంటారు.

కొన్నికొన్ని సందర్భాలలో ఆటో కిరాయిలు, రైతుకు కూలీ కూడా పడటం లేదని పేర్కొంటున్నారు. స్వంత ఆటో ఉన్న రైతులు హైదరాబాద్‌కు తరలిస్తుండటంతో వారు కొంత లాభపడుతున్నారు. రైతులు తక్కువ పండిన రైతులు పారబోయడానికి ఇష్టపడక వారసంతలలో అమ్ముతూ నష్టాలు పూడ్చుకుంటున్నారు. ఒకప్పుడు లాభసాటిగా ఉన్న కూరగాయల సాగు తరచూ వర్షాలు పడుతుండటం వల్ల కోలుకోలేని పరిస్థితులలోకి నెట్టివేయబడుతున్నారు.

వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది

అవారి బాబు, కూరగాయల రైతు, తిప్పాపూర్



తరచూ వర్షాలు పడటంతో పాటు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు లేకపోవడం వల్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 2.5 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలను సాగుచేశారు. టమాట, కీరదోస, చిక్కుడు పంటలను వేయడం ద్వారా లాభాలు వస్తాయని ఆశించా. పంటచేతికి అందివచ్చే వరకే రూ 2లక్షల పెట్టుబడులు అయ్యాయి. సరైన ధరలు లేకపోవడంతో పాటు తెగుళ్ల ఎక్కువగా రావడంతో కూరగాయల రైతులు నష్టాలు చవిచూడవలసిన పరిస్థితిలు ఏర్పడ్డాయి.

తెగుళ్లను తొలిదశలో గుర్తిస్తేనే లాభాలు..

వాసాల గోవర్దన్, సిరిసిల్ల డివిజన్ హార్టికల్చర్ ఆఫీసర్



కూరగాయల పంటలను ఆశించే తెగుళ్లను తొలి దశలో గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే లాభాలు గడించవచ్చు. టమాల, మిరప పంటలకు ఆకుమచ్చ తెగుళ్ల వస్తే మాంకోజేట్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచాకారి చేయాలి. తామర పురుగులు ఆశిస్తే 2మీ.లీ డైమిథోయేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా తెగుళ్ల బాధ తొలగిపోతుంది. రైతులు మారుతున్న పరిస్థితులను నిరంతరం గమనిస్తూ పంటలను తెంపుకోవాలి.

కలెక్టర్ గళంలో 'ఓ చిన్ని పిచ్చుక' పాట



పాట పాడుతున్న కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అవనిలో అంతరిక్షంలో మగవారితో సమానం ఆడవారు. ఈనాటి కాలంలో పురుషులతోపాటు స్త్రీలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తు న్నారు. అక్కడ క్కడా నిరక్షరాస్యత, పేదరికం, ఆడవారి పై చిన్న చూపు వంటి కారణాలు అమ్మాయిల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. తల్లిదండ్రులకు గర్భ శోకాన్ని మిగులుస్తున్నాయి. ఆడ పిల్లల మనుగడకు అడ్డంకిగా మారుతున్నాయి. ఈ దిశలో పుట్టుక నుంచి ఓ ఇంటి ఇల్లాలయ్యేవరకు ఆడపిల్లల సమస్యలను అర్థం చేసుకున్న కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి మదిలో ఓ ఆలోచన మెరిసింది.

హిందీలో స్వానంద్ కిర్కిరే అనే రచయిత రాసి, పాడిన పాటను తెలుగు లోకి అనువ దిస్తే సమాజంలో అవగాహన పెరుగుతుందని భావించారు. దీంతో ఖార్థానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నంది శ్రీనివాస్‌ను పిలి పించుకొని తన అంతర్గత భావాన్ని ప్రస్తావించారు. ఆయన స్పందించి పాటను తెలుగులోకి అనువదించగా కలెక్టర్ స్వయంగా పాటను ఆలపించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాటను ఆవిష్కరించారు.

రాజన్న ఆలయ అభివృద్దే ప్రధాన ఎజెండా..

● అందరి సలహాలు, సూచనల మేరకు పనులు
● 19న వేములవాడకు శృంగేరి పీఠాధిపతి రాక
● దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్



రాజన్న ఆలయ పరిశరాలను పరిశీలిస్తున్న శైలజరామయ్యార్, ఆదిశ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజన్న ఆలయ అభివృద్దే ప్రధాన ఎజెండా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి ఈనెల 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, వీటీడీఏ వైస్‌చైర్మన్ కలెక్టర్ ఎం హరిత, ఎస్పీ మహేష్ బీగితే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు భక్తుల విశ్వాసాలు, అభిప్రాయాలు, పండితులు ఇతర ప్రముఖుల సలహాలు సూచనలు మేరకు చేపడుతున్నామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇతర మంత్రుల సహకారంతో పనులు ముందుకు సాగుతున్నాయని వివరించారు. మొదటి దశలో రూ.76 కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణ, అభివృద్ధి, రూ.35 కోట్లతో అన్న ప్రసాద వితరణశాల, రూ.47 కోట్లతో ప్రధాన రహ దారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని తెలి పారు. భక్తుల విశ్వాసాలు, నమ్మకాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి విస్తరణ చేస్తామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ పనులపై ప్రతి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నామని తెలిపారు. ఈనెల 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి రానున్నారని వెల్లడించారు. ఈ మేరకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించామన్నారు. భక్తులకు రాజన్న ఆలయ ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్, ప్రచారథంలో దర్శనం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, వీటీ డీఏ వైస్‌చైర్మన్, కలెక్టర్ ఎం. హరిత, ఎస్పీ మహేష్ బి.గితే ఆలయ ఈవో రమాదేవి ఉన్నారు.

నరసింహుడి హుండీ ఆదాయం 46.84 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న మహిళలు

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించగా రూ.46,84,046 ఆదాయం లభించింది. గత జూన్ 26 నుంచి అక్టోబరు 15 వరకు గల హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. 27 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 700 గ్రాముల మిశ్రమ వెండి, 26 విదేశీ నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం. రాజమౌళి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం

రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి



జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రిటైర్డు ఉద్యోగులు

జగిత్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి అన్నారు. బుధవారం జగిత్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద రేవా ఉమ్మడి జిల్లా ఆధ్వ ర్యంలో రిటైర్డు ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో హకీంను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోహెడ చంద్రమౌళి మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రయోజనాలు వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వెంటనే రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతోందని విమర్శించారు. పెన్షన్ బకాయిలు రాక పెళ్లిళ్ల చేయలేక, ఇల్లు కట్టుకోలేక అనారోగ్యంతో బాధపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గద్ద జగదీశ్వరచారి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎన్నం రాంరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మామిడాల లక్ష్మీ నారాయణ, కోశాధికారి కనపర్తి దివాకర్, ఐల్నేని నరేందర్‌రావు, వెంకట రమణ, నసీం అహ్మద్, కటకం ప్రభు, కరుణ శ్రీ, రాందాస్, వేణుగోపాల్, విమల, చంద్రమౌళి,చంద్రశేఖర్, దుబ్బయ్య, మదన్‌మోహన్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక





నందకిషోర్, వాత్సల్య

గంగాధర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల పీడీలు తెలిపారు. గంగాధర ప్రభుత్వ పాఠశాలకు చెందిన కట్ల నందకిషోర్ సిరిసిల్లలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 వాలీబాల్ టోర్న మెంటులో ప్రతిభ కన బర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సంగారెడ్డిలో ఈ నెల 16 నుంచి జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. గంగాధర మోడల్ స్కూల్‌కు చెందిన వాత్సల్య అండర్ 14 విభాగంలో పెద్దపల్లి జిల్లాలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నాగార్జున తెలిపారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అనుష్క రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీ లకు ఎంపికయింది. మంగళవారం కరీంనగర్‌లోని ఎల్ఎండీ కాలనీలోని శ్రీచైతన్య డిఫెన్స్ అకాడమిలో ఉమ్మడిజిల్లాల స్థాయి ఎస్జీఎఫ్ అండర్ 19 విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో అనుష్క తన క్రీడాప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానం దక్కించుకుంది. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని కళాశాల స్పోర్ట్స్, గేమ్స్ ఇన్‌చార్జి సునీల్‌తోపాటు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



అనుష్కను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మల్యాల : మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పాఠశాలల కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో జి.యశశ్వని, జి.హారిక జగిత్యాల జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మండల విద్యాధికారి ఎన్.జయసింహరావు, క్రీడల మండల కన్వీనర్ విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదవుతున్న శ్రీజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. ఈ సం దర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థిని శ్రీజను ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు. అక్టోబరు 14న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్జీఎఫ్ అండర్ 14 కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీల్లో శ్రీజ అత్యంత ప్రతిభ కనబరిచి సంగా రెడ్డి పటాన్‌చెరువులో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ కుంబాల సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీజను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ఆనంది



జాతీయ స్థాయిలో మూడో స్థానంతో గుర్తింపు

కమాన్‌పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో ఈనెల 14న జరిగిన 40వ జాతీయ జూనియర్ చాంపియన్ షిప్ అండర్ 16 విభాగంలో నల్లవెల్లి ఆనంది మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ అందుకున్నది. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నల్లవెల్లి శంకర్ భారతిల రెండో కుమార్తె ఆనంది గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదవు తున్నది. అలాగే ఆమె అథ్లెటిక్స్‌లో కొన్నేళ్లుగా తన ప్రతిభతో రాణిస్తూ పలు మెడల్స్ సాధించింది. ఈ మేరకు భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో మరో సారి రాణించి మెడల్ సాధించడంపై లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ఆనంది కోచ్ సుబ్బారావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సారంగపాణి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌లు బుధవారం ఆనందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆనంది పాల్గొంటున్న టోర్నీల్లో ప్రతిభతో మెడల్స్ సాధించడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. అలాగే పలు మెడల్స్ అందుకొని, పుట్టిన ఊరుకు, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు వాల్ పెయింటింగ్ పోటీలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా మహిళలు, పిల్లలు దివ్యాంగులు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జూనియర్ కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను తెలియజేసే విధంగా బుధవారం వాల్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు.

కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయ కాంపౌండ్‌పై మత్తు పదార్థాల వినియోగంతో కలిగే సమస్యలను పెయింటింగ్ ద్వారా వివరించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఎన్ఎంబీఏ కమిటీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి, మర్రి రాజేందర్ పోటీలను పర్యవేక్షించారు.

లొంగుబాటు 'తారక' మంత్రమేనా?

(7వ పేజీ తరువాయి)

క్రితం సాయుధ పోరాటాన్ని వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసి, తద్వారా ప్రజాసమస్యలపై ఉద్యమాలు చేపట్టి మావోయిస్టు పార్టీని రక్షించుకోవాలని మల్లోజుల వేణు గోపాలరావు లేఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనిని పార్టీకి చెందిన కొందరు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి లొంగి పోవాలనుకుంటే ఆయుధాలను పార్టీకి ఇచ్చి లొంగిపోవాలని పేర్కొన్నారు. ఆ తర్వాత కూడా ఆయన మరోరెండు లేఖలను విడుదల చేశారు. అప్పటినుంచే ఆయన పోలీసులకు లొంగి పోతారనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఆయన మరో 61మంది మావో యిస్టులతో కలిసి ఆయుధాలతో సహా లొంగి పోవడం సంచలనం సృష్టించింది. మల్లోజుల వేణు గోపాల్‌రావు పేరిట ఉన్న ఆరుకోట్ల రూపా యల రివార్డును సీఎం అందించారు.

రైస్‌మిల్లు మహిళా కార్మికుల వేతన ఒప్పందం చేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో పనిచేస్తున్న మహిళా కార్మికుల వేతన ఒప్పందాలను సవరించుకో వాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్ రైస్‌మిల్లు మహిళా కార్మికుల విస్తృత జనరల్ బాడీసమావేశం శాస్త్రీనగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న బార్దాన్ రిపేరు, సంచులు దులపడం, ఘట్టాలు కట్టడం, మిల్లులను శుభ్రం చేయడం, తుడవటం తదితర పనులు చేస్తున్న మహిళా కార్మికుల వేతన ఒప్పందం 2025సెప్టెంబరుతో ముగిసిందని, కాలపరిమితి మేరకు వారి పెరిగిననిత్యావసర సరుకుల, వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకుని వేతనాలు పెంచడానికి వెంటనే యూనియన్ నాయకత్వంతో చర్చించాలని రైస్‌మిల్ ఓనర్స్ అసోసియేషన్‌కు విజ్ఞప్తి చేశారు. లేనియెడల కార్మికులను సమీకరించి ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ సుల్తానాబాద్ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, మహిళా కార్మికుల యూనియన్ అధ్యక్షులు గున్నాల అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

కాల్వశ్రీరాంపూర్: గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ కాల్వశ్రీరాంపూర్ మండల 4వ మహాసభ బుధవారం స్థానిక పెద్దమ్మగుడి ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లాకార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి కార్యచరణ రూపొందించడం కోసం ఈనెల 24,25తేదీల్లో యూనియన్ రాష్ట్ర 5వమహాసభలు గార్ల పట్టణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయడానికి అన్నివర్గాలు పాల్గొనాలని ఆయనకోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లాప్రధాన కార్యదర్శి ఖాజా పాల్గొనగా, నూతన మండలకమిటీని నియమించారు. ఇందులో మండల అధ్యక్షుడిగాదొడ్లరాజబాబు, ప్రధానకార్యదర్శిగా అంబాల లక్ష్మణ్, కోశాధికారిగా శనగరపు రాజయ్య, గౌరవ సలహాదారులుగా కలవేని గట్టయ్య, గౌసుద్దీన్‌తోపాటు 25 మంది కమిటీసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వరిలో చీడపీడలపై రైతులకు అవగాహన

పాలకుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల గ్రామంలో బుధవారం రైతులకు వరిలో చీడపీడల పట్ల వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. జిల్లావ్యవసాయ సహాయ సంచాలకుడు జక్కుల కాంతరావు క్షేత్రపర్యటనలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు.రైతులు వరిలో ఎండాకు తెగులు,సుడిదోమ వస్తున్నందున వెంటనే సరైన మందులను వ్యవసాయ అధికారులను సంప్రదించి పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బాలురి శశిధర్, మండల వ్యవసాయ అధికారి బండిప్రమోద్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



కన్నాలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

స్లాట్ బుకింగ్ పద్ధతుల్లో పత్తి కొనుగోళ్లు

● రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి ● వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వైనాల రాజు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ మార్కెట్ అధికారులు, సిబ్బంది

కమాన్‌పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు దళారుల సమస్యలు లేకుండా ఇక నుంచి నేరుగా స్లాట్ బుకింగ్ పద్ధతుల్లో పత్తిపంటను కనీసమద్దతు ధరకు విక్రయించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని కమాన్‌పూర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ వైనాల రాజు అన్నారు. మండలకేంద్రంలో బుధవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ప్రభుత్వం, కాటన్ కార్పొరేషన్ ఇండియా ప్రకటించిన పంటల కనీసమద్దతు ధరల వాల్‌పోస్టర్లను ఆయనతోపాటు అధికారులు, సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఈ యాప్‌ను రైతులు స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈయాప్ ద్వారా సమీపంలోని ఏ జిన్నింగ్ మిల్లులో పత్తి విక్రయించాలనుకుంటే ఆ రోజు స్లాట్ బుకింగ్ చేసి రైతులకు తెలుపుతామని అన్నారు. దీని వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ మేరకు రైతులకు అవగాహన నిమిత్తం వాల్ పోస్టర్లను ఆవిష్కరించామని తెలిపారు. దీనిపై ఎలాంటి సందేహాలు ఉన్నా రైతులు ఏఎంసీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లలిత, ఏఎంసీ కార్యదర్శి ఈర్ల సురేందర్‌తోపాటు మార్కెట్ కమిటీ కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇద్దరికి కలామ్ బెస్ట్ టీచర్ అవార్డు

ధర్మారం/జ్యోతినగర్/అంతర్గాం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కలామ్స్‌బెస్ట్ టీచర్ అవార్డును ధర్మారం స్మార్ట్‌కిడ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుదారపు మహేందర్, జ్యోతినగర్ విశ్వభారతి విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి గౌడ్ సొంతం చేసుకున్నారు. అబ్దుల్ కలాం జయంతి వేడకులను లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాసా సైంటిస్ట్ సతీష్‌రెడ్డి చేతుల మీదుగా వారు 'డాక్టర్ కలామ్స్ బెస్ట్‌టీచర్‌అవార్డు2025'ను అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంపై ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలిపారు.

ఘనంగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి..

జూలపల్లి: మాజీరాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను మండలంలోని పెద్దాపూర్‌లో బుధవారం సంకెండ్ల లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కల్లెపెల్లి లింగయ్య, శేకర్‌యాదవ్, రాజన్నల ఎల్లయ్య, శేఖర్, మహేష్, రాయమల్లు, రాజిరెడ్డి, రాము, అనిల్, నరేష్, పలువురు పాల్గొన్నారు.



బెస్ట్ టీచర్ అవార్డ్ అందుకుంటున్న బుదారపు మహేందర్

ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్ లైసెన్స్ పొందాలి

కోల్‌సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో సీజనల్ వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్ లైసెన్స్ పొందాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ సూచించారు. ముందుగా స్మార్ట్ ఫోన్‌లో, కంప్యూటర్‌లో అప్‌లోడ్‌చేస్తే మొబైల్‌ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకోవడం జరుగుతుందని, వ్యాపార వివరాలు నమోదు చేసి అవసరమైన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేస్తే చెల్లించాల్సి ఫీజు వివరాలు తెలుపుతుందన్నారు. సబ్‌మిట్ చేసిన తరువాత దరఖాస్తు సంఖ్య నమోదు అయిన పేమెంట్ స్క్రీన్ వస్తుందని, పేమెంట్ చేసిన తరువాత టీఐఎన్ నెంబర్‌తో ట్రేడ్ లైసెన్స్ నెంబర్ జనరేట్ అవుతుందని, ఒక మెసేజ్ దరఖాస్తుదారుని మొబైల్‌కు వస్తుందని, మార్చి 31వరకు చెల్లుబాటులో ఉంటుందని తెలిపారు.

కారుణ్య నియామకాలను ఎత్తివేయడానికి ప్రయత్నిస్తున్న యాజమాన్యం

● టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కారుణ్య నియామకాలను ఎత్తివేసే కుట్రలో భాగంగా మెడికల్ బోర్డును నిర్వహించడం లేదని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన కారుణ్య నియామకాలతో ఎంతో మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు వచ్చి వారిజీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఇప్పటి వరకు మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల పిల్లలకు ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదన్నారు. నెలనెలా నిర్వహించే మెడికల్ బోర్డును తక్షణమే నిర్వహించాలని, విజిలెన్స్ మారుపేర్లతో ఉన్న డిపెండెంట్లకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, పొలాడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింగరేణికి వందేళ్ల భవిష్యత్

● 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాలపై మేధోమదనం



సమావేశంలో పాల్గొన్న సింగరేణి మాజీ డైరెక్టర్లు, అధికారులు

గోదావరిఖని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భవి ష్యత్, తీసుకోవాల్సిన వ్యూహాత్మక కార్యకలాపాలపై యాజ మాన్యం ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్మికసంఘాలు, ఉద్యోగులు, అధికారుల నుంచి ఇంతకాలం సలహాలు, సూచనలు తీసుకున్న సింగరేణి యాజమాన్యం ఇప్పుడు సింగరేణి రిటైర్డ్ ఉన్నతాధికారులను భాగస్వామ్యం చేసింది. బుధవారం కొత్తగూడెంలో మేధోమధనం నిర్వహిం చింది. బొగ్గుఉత్పత్తి లక్ష్యం 100మిలియన్ టన్నుల దిశగా పయనించడానికి, భవిష్యత్ ప్రణాళికలను రూపొందించడానికి కార్పొరేట్‌స్థాయి జీఎం అధికారులతో కొత్తగూడెం ఇల్లందు క్లబ్‌లో ఈ సమావేశం జరిగింది. జీఎం(సీపీపీ) మనోహర్ అధ్యక్షతన ఈ మేధోమదనం నిర్వహించారు. సీఎండీ బలరాం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భవిష్యత్‌లో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడానికి, సింగరేణి ఇతర రంగాల్లో విస్తరించడానికి రిటైర్డ్ అధికారుల అనుభవాలు, సలహాలు అవసమని సీఎండీ ఈ సందర్భంగా వారిని కోరారు. డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ భూగర్భ, ఉపరితల బొగ్గుగనుల్లో ఉత్పత్తి, థర్మల్, సౌర విద్యుత్ ఉత్పత్తి భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించారు. అనంతరం సింగరేణిసంస్థలో డైరెక్టర్లు, జీఎంల స్థాయిలో పదవీ విరమణ పొందిన అధికారులు సింగరేణి స్థిరమైన లక్ష్యసాధన కోసం, బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలను యాజమాన్యానికి వివరించారు. బొగ్గుఉత్పత్తి కాకుండా ఇతర రంగాల్లో విస్తరించే ఆవశ్యకతను కూడా వారు చెప్పారు. ఈ మేధోమదనంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారా యణ, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు, డైరెక్టర్(పా) గౌతం పొట్రు, డైరెక్టర్(ఈఅండ్ఎం) తిరుమలరావు, అడ్వయిజర్ మినిస్ట్రీ ఆఫ్ కోల్ వీరారెడ్డి, రిటైర్డ్ డైరెక్టర్లు డీఎల్ ఆర్కే ప్రసాద్, రమేష్ కుమార్, మనోహర్‌రావు, భాస్కర్‌రావు, బాలకోట రెడ్డి, రిటైర్డ్ జీఎంలు సీకేరెడ్డి, గురువయ్య, సీతారామారావు పాల్గొన్నారు.



సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పీఎల్ఐ బోనస్‌ను చెల్లించాలి

● బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

గోదావరిఖని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం పీఎల్ఐ బోనస్‌ను చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు పీఎల్ఐ బోనస్ దేశవ్యాప్తంగా అమలవుతుందని, కానీ సింగరేణిలో అమలు చేయకుండా యాజమాన్యం మొండివైఖరి వహిస్తోందన్నారు. దీనిపై ఇటీవల కేంద్ర బొగ్గు గనులశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సింగరేణి సీఎండీ కూడా మాట్లాడారని, కాంట్రాక్టు కార్మికులకు పీఎల్ఐ బోనస్ ఇవ్వడానికి ఒప్పుకున్నారని అన్నారు. విలేకరుల సమావేశంలో బీఎంఎస్ నాయకులు గుండబోయిన భూమయ్య, బండారి శ్యామ్, చిగురు లక్ష్మణ్, గొడుగు సమ్మయ్య, విశ్వనాథ్, అశోక్, వినయ్, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓసీపీ-1 సమస్యలు పరిష్కరించాలి

● ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ప్రాజెక్టుతో పాటు సెక్టార్-3 కాలనీలో సమస్యలను పరిష్కరించే దిశగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం ప్రాజెక్టు సైటాఫీస్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో తిరుపతి మాట్లాడారు. మోటార్ గ్రేడర్లు, డోజర్లు తగినన్ని అందుబాటులో లేకపోవడంతో పాటు డంపర్లు, వాటర్ ట్యాంకర్ల సస్పెన్షన్లు మరమ్మతులు చేయకపోవడంతో ఆపరేటర్లు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. హాల్ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నదని, క్వారీలో సరిపడా లైటింగ్ లేదన్నారు. ఏడాది గడిచినా లెదర్ షూస్ ఇవ్వలేదని, వెంటనే షూస్ ఇవ్వాలని తదితర డిమాండ్స్ చేశారు. ఈగేట్‌మీటింగ్‌లో ప్రభాకర్ రెడ్డి, కొండల్‌రెడ్డి, సలీం, శ్రీనివాస్, రమేష్, చారి, రామచందర్‌రావు, చంద్రయ్య పాల్గొన్నారు.

దీపావళి ఉత్సవాలను విజయవంతం చేయండి

ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 19న జరిగే దసరా, దీపావళి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ పుర ప్రముఖులకు పిలుపునిచ్చారు. బుధవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో దసరా, దీపావళి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాలకారణంగా దసరా ఉత్సవాలను దీపావళికి వాయిదా వేశామని, 19వ తేదీన సాయంత్రం రావణవధతో పాటు ఫుడ్ ఫెస్టివల్, ఫైర్‌షో, సిని గాయని, గాయకులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన జీఎం..

కళ్యాణ్‌నగర్ : గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 19న నిర్వహించనున్న దసరా, దీపావళి ఉత్సవాలు-2025 ఏర్పాట్లను బుధవారం సినీనటుడు శివారెడ్డి ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, సింగరేణి యాజ మాన్యం, మున్సిపల్ కార్పొరేషన్, ఎన్‌టీ పీసీ సహకారంతో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు అలీ, గాయని గీత మాధురి, జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్ టీమ్, డ్యాన్స్ గ్రూప్ గోవింద్ టీమ్ హాజరవుతారని, ప్రత్యేకంగా పుర ప్రముఖులను అలరించడానికి వినోద కార్యక్రమాలు, పలు రకాల ఫుడ్ స్టాల్స్, ఎగ్జిబిషన్, ఫైర్‌షో, రావణ దహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగులు, ఎన్‌టీపీసీ ఉద్యోగులు, పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో సివిల్ ఏజీఎం వరప్రసాద్, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, సింగరేణి శ్రీనివాస్, దాసరి విజయ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇండియన్ పబ్లిక్‌పాఠశాల విద్యార్థి అఖిల్‌కుమార్ ఎంపిక య్యాడు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కరీంనగర్ ఉమ్మడిజిల్లా అండర్14బాలురకబడ్డీ విభాగంలో అఖిల్ కుమార్ పాల్గొన్నాడు. అఖిల్‌కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపట్ల పాఠశాలచైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ క్రిష్ణప్రియా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఈనెల 16,18తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయిపోటీల్లో అఖిల్ కుమార్ పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, శివ, సతీష్, మమత పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని కనగర్తి దాసరి పద్మ, హన్మయ్య హైస్కూల్‌కు చెందిన ముద్దుమల్ల అజయ్ రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీకి ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్ 2025-26కు గాను నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి టోర్నీలో పెద్దపల్లి జిల్లా అండర్14 బాలుర విభాగం లో కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో అత్యంత ప్రతిభ కనబరిచిన 15మంది క్రీడాకారుల్లో కనగర్తి హైస్కూల్‌విద్యార్థి అజయ్‌కి స్థానం లభించినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు. ఎస్‌జీఎఫ్‌లో భాగంగా హనుమకొండ వేదికగా నిర్వహించిన బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఇదేపాఠశాలకు చెందిన వేల్పుల లక్ష్మి ఉత్తమప్రతిభతో విజేతగా నిలిచి కాంస్య పథకాన్ని సాధించి స్కూల్ పేరును చాటింది. విజేతలకు పాఠశాల ఉపాధ్యాయబృందం, ఎంఈఓరమేష్ పుష్పగుచ్ఛంఅందజేసి సన్మానించారు.

మంచినీటి సరఫరాను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ బుధవారం పరిశీలించారు. వాటర్‌ట్యాంకులు, బావులను ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రంచేసి, స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఇంటికి 45 నిమిషాల చొప్పున వచ్చేలా నీటిని అందిస్తున్నామని, ప్రతిఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా పశువులకు గాలికుంట నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌భాస్కర్ తెలిపారు. గోదావరిఖని గోశాలలో బుధవారం పశువులు, పాడిపశువులకు గాలికుంట నివారణటీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో పశు వైద్యాధికారులు శిబిరాలు నిర్వహిస్తారని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఖని ఏరియా వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీదేవి, అంతర్గాం మండల పశు వైద్యాధికారి పల్లెప్రసాద్, పశువైద్య సహాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

108ను తనిఖీ చేసిన జిల్లా కోఆర్డినేటర్

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బుధవారం జిల్లాకోఆర్డినేటర్ జంపాల కుమారస్వామి 108అంబులెన్స్‌ను తనిఖీచేశారు. మెడికల్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించిన పరికరాలు, పనితీరు, అవి పనిచేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సమయాల్లో కాల్ వచ్చిన తక్షణమే స్పందించాలని, అంబులెన్స్ సిబ్బందికి సూచించారు. పేషంట్లను తరలించేప్పుడు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. నిరంతరం అందుబాటులో ఉంటూ అందరికీ సేవలందించాలని సూచించారు.

ఘనంగా జాతీయ కూచిపూడి దినోత్సవం

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ కూచిపూడి దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌కు చెందిన పలువురు బాలికలు కూచిపూడి నత్యం నేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు బుధవారం జాతీయ కూచిపూడి నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసుకుని సంబరాలు జరుపుకున్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు

ఓదెల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీటీ రోడ్లపై ధాన్యం ఆరబోస్తే సంబంధిత కఠినచర్యలు తప్పవని పొత్కపల్లి ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ, బీటీ రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల రాత్రుల్లో వాహనదారులు వాటిని గమనించక ప్రమాదాల బారిన పడతారని తెలిపారు. రైతులు ఎవరు కూడా రోడ్లపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారకులు కావద్దని తెలిపారు. ఒకవేళ ఆరబోసిన ధాన్యం వల్ల ప్రమాదం జరిగితే సంబంధిత రైతులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు.

మాజీ కార్పొరేటర్ల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



రాజయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 10వ డివిజన్, 31వ డివిజన్ మాజీ కార్పొరేటర్లు అడ్డాల రామస్వామి, అడ్డాల గట్టయ్య కుటుంబాన్ని బుధవారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ పరామర్శించారు. గట్టయ్య, రామస్వామి తండ్రి అడ్డాల రాజయ్య బుధవారం అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని ఓదార్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయనవెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంకాళి స్వామి, దీటి బాలరాజు ఉన్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎలిగేడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి ఝాన్సీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముప్పిరితోటలో పశు వైద్యశిబిరం ఏర్పాటు చేసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు ఉచితంగా గాలికుంటూ నివారణ టీకాలు అన్ని గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సమ్మయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఊశన్నపల్లిలో ఉచిత వైద్యశిబిరం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో బుధవారం మండలంలోని ఊశన్నపల్లిలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో 150మందికి ఆసుపత్రి వైద్యులు లోకేష్ వైద్య పరీక్షలు చేశారు. మెడికవర్ ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో 24గంటల వైద్యం అందుబాటులో ఉంటుందని అన్నారు. శిబిరంలో మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని సుల్తానాబాద్ స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ అన్నారు. కేంద్ర క్రీడలు యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో మైభారత్ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ ప్రభుత్వజూనియర్ కళాశాలలో బ్లాక్‌లెవెల్ క్రీడాపోటీలను బుధవారం నిర్వహించారు. ఈపోటీలను స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు రవీందర్, మున్సిపల్ కమిషనర్ రమేష్ తదతరులు ప్రారంభించారు. సాయంత్రం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్‌క్లబ్ ప్రధానకార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.